



# మనిషి

"మిర్రర్"

అది. .

నేషనల్ హైవే

అందులో విజయవాడ వెళ్ళే మార్గం

అందువల్ల—

ఆ రోడ్డుమీద నిముషానికో బస్సు, రెండు నిముషాలకో లారీ అటో ఇటో దూసుకుపోతున్నాయి.

అలాంటి రోడ్డు ప్రక్కనగల సిటీబస్ స్టాప్‌లో ఎంతకీరాని బస్సుకోసం ఓపికగా ఎదురు చూస్తున్నాను

సమయం పది దాటింది

ఒక ముఖ్యమైన పనిమీదకి ఓ పెద్దమనిషిని కలుసుకోవటానికి మలక్‌పేట కాలనీ వచ్చాను వచ్చిన పని ముగించుకుని బయట పడేసరికి ఆఫీసు టైము దాటిపోయింది

ఎలాగూ లేటు తప్పదు కాబట్టి తాపీగా బస్సు కోసం ఎదురుచూస్తున్నాను

రోడ్డుకి అటువైపున ఓ పెట్రోల్ బంకు వుంది

ఇటుప్రక్కన ఓ పెద్ద చెట్టు

ఆ చెట్టుకింద సిటీ బస్‌స్టాప్

వర్షాకాలం చెరువులో నీటిమట్టం వడివడిగా పెరిగినట్టు, నిముష నిముషానికీ చెట్టుకింద బస్సు కోసం రద్దీ ఎక్కువ అయిపోసాగింది

వచ్చిన ఒకటి అరబస్సుకూడా ఈ జనసమ్మర్ధం చూసి ఆగకుండా వెళ్ళిపోతున్నాయి.

ఏమిటి కర్తవ్యం అని ఆలోచిస్తుండగా—

చెవులు చిల్లులు పడేలా—

గుండె అదిరిపోయేలా—

ఏదో ప్రళయం సంభవించినంత కంగారు పుట్టించేలా —

కీ — ఈ — ఈ — చు మని శబ్దం చేసు కుంటూ —

వేగంగా దూసుకుపోతున్న ఓ పెద్ద లారీ సడెన్ బ్రేక్‌తో రోడ్డుమీద నిలిచిపోయింది.

అంతే వేగంతో దానివెనక వస్తున్న మరికొన్ని వాహనాలు ఒకదాని తరువాత మరొకటి మరింత భయంకరమైన శబ్దం చేసుకుంటూ ఆగిపోయాయి

ఆగిన మరుక్షణం ఆ లారీ మళ్ళీ కదిలి వెళ్ళిపోయింది.

దీనికంతకూ కారణం ఓ పిచ్చివాడు.

రోడ్డుమీద వాహనాలను గమనించకుండా మతిభ్రమణంలో అటునుంచి రోడ్డుకి అడ్డంగా ఇటువైపుకి పరుగెత్తుకుంటూ వచ్చాడు

ప్రమాదం రెప్పపాటులో తప్పిపోయింది లేకుంటే, ఈపాటికి అతని ప్రాణం పోయివుండేది

ప్రమాదం జరగనందుకు ఆ బస్ స్టాప్‌లో నుంచున్న వారందరి ముఖంలో పెద్ద రిలీఫ్

అయితే ఆ పిచ్చివాడికి జరిగిన సంగతి స్పృహలో లేదు

అతను తన ధోరణిలో తాను పిచ్చిగా పాడుతూ, అరుస్తూ అటూ ఇటూ తిరగసాగాడు

అతను ఎందుకింత రిస్కు తీసుకుంటున్నాడో!

పిచ్చివాళ్ళకు ప్రాణ భయం వుండదా?

ఏమో!

అనుకోకుండా ఆ పిచ్చివాడిపై నాకు జాలి ఏర్పడసాగింది ఆ జాలిలో అతని వంక మరింత పరిశీలనగా చూసాను

మనిషికి పాతికేళ్ళుంటాయి. గడ్డం పెరిగింది జుట్టు దుమ్ము కొట్టుకునివుంది

వంటిమీద ఓ చిరిగిన పాంటు వుంది తన సైజుకి సరిపోని ఓ చిరిగిన బుష్‌షర్టు వుంది అతని శరీరము బట్టలు అన్నీ మురికిగా జిడ్డుగా వున్నాయి

మనిషి బక్కచిక్కిపోయిలేడు కానీ బలంగా కూడా లేడు. ఏదో వెతుకుతున్నట్టుగా దీక్షగా నేలకేసి చూస్తున్నాడు. మళ్ళీ అంతలోనే ఇటునుంచి అటు, అటునుంచి ఇటు గబగబా నడవసాగాడు

లారీ ప్రమాదం నుంచి తప్పించుకున్నప్పటి నుంచీ, బస్‌స్టాప్‌లో జనం అంతా అతన్నే గమనించ సాగారు.

అతను వున్నట్టుండి —

ఓ రాజకీయ నాయకుడి వుపన్యాసం అనుకరిస్తూ ఏవో మాట్లాడటం మొదలుపెట్టాడు

బస్సు రాకపోవటంతో అక్కడివారందరికీ అతనో కాలక్షేపం అయ్యాడు

క్షణంసేపు నేను ఆశ్చర్యపోయాను

కారణం —

అతనినుంచి వెలువడుతున్న మాటల్లో ఎక్కడా అశ్లీలం దొర్లటంలేదు. భాష చాలా చక్కగా వుంది చెప్పే విషయంలో కంటిన్యూటీ వుంది అతను పిచ్చివాడు కాబట్టి సరిపోయింది లేదంటె అదొక భాషాయుక్తమైన ప్రసంగం భావావేశంతో నిండిన పదజాలం

ఆలోచించగా అతను చాలా తెలివైనవాడని తెలుస్తోంది — కాగా జీవితంలో ఏదో కారణంగా పిచ్చివాడూ అయిపోయివుంటాడు

అతను ఇంకా ఉపన్యాసం కొనసాగిస్తున్నాడు

తరువాత—

రోడ్డుమీద పడివున్న ఓ న్యూస్ పేపరు ముక్కను లౌడ్ స్పీకరు గొట్టంలా చుట్టి, దాన్ని తన నోటిముందు వుంచుకుని, ఒక హిందీ సినిమా పాట పాడటం మొదలు పెట్టాడు

పాటలో చరణాలు ఒకదాని కొకటి సంబంధం లేకుండా అర్థరహితంగా వున్నాయి

దాంతో అక్కడి వారికి నవ్వు వచ్చింది.

ముందు ఎవరో ఒకరు నవ్వారు

తరువాత ఒకరి వెనుక మరొకరు హేళనగా నవ్వసాగారు

కానీ నాకు నవ్వు రాలేదు

తోటి మానవుడి అభాగ్యస్థితిని చూసి నవ్వటం అమానుషం ఎదుటివాడు నిస్సహాయస్థితిలో ఇరుక్కోవటం తనకి హాస్యం ఎంతటి దారుణం ఇది

ఎందుకో! అతని స్థితికి నాకు తెలియకుండానే నాలో ఏదో బాధ మొదలు అయింది

బస్సు ఇంకా రాలేదు

ఇప్పుడు రాని బస్సుకోసం ఎవరూ బాధపడటం లేదు అందరికీ ఆ పిచ్చివాడు వినోదం అయి పోయాడు

పిచ్చివాడు తన హిందీ పాటను ఆపి, నోటి ముందు ఇంతవరకు లౌడ్‌స్పీకరుగా మడిచిన ఆ న్యూస్ పేపరు తెరిచి, అందులోని అంశం చదివి వినిపించ సాగాడు

అదొక ఇంగ్లీషు న్యూస్ పేపరు

అతను అచ్చగా, ఆలిండియా రేడియోలో న్యూస్ బులెటిన్ చదివినట్టు చదువుతున్నాడు

నా సందేహం తీరిపోయింది

నిస్సందేహంగా అతను విద్యావంతుడే!

కానీ విధి వంచించినట్లుంది పిచ్చివాడై పోయాడు ఇంటివద్ద అతనికి ఎవరున్నారో ఏమో!

తిండిలేక, తోడులేక, రోడ్డుప్రక్కన అనుక్షణం పదిమందిలో అవహేళన చేయబడుతూ, జీవచ్ఛవంలా బ్రతకవలసిరావటం ఖర్మ కాకపోతే ఏమిటి?

అతను న్యూస్‌పేపరు చదువుతూనే ఒక్కొక్కరి ముందునుంచి కదిలిపోసాగాడు

జాలిగుండె కలవారు తమకు తోచిన ధర్మం చేస్తున్నారు అయిదుపైసల బిళ్ళలు, పదిపైసల నాణేలు అన్నీ కలిపితే రూపాయి వుండవచ్చు

బస్సు ఇంకా రాలేదు.

## శాస్త్రీయమ్!

నీటిలో ఉన్న
ప్రతి వస్తువూ కొంత బరువును పోగొట్టుకొంటుందనేది
ఆర్కిమెడిస్ సూత్రము!

పదవిలో ఉన్న
ప్రతి వ్యక్తీ కొంతవరకైనా నీతి నిజాయితీని వదులు కొంటాడనేది
రాజనీతి తంత్రము!

కోల్పోయిన వస్తువు బరువు = పొర్లిపోయిన నీటి బరువు
అని 'క్లియర్ కట్ హైపాతిసిస్'!

కోల్పోయిన నీతి నిజాయితీ బరువు = దాచిపెట్టుకొన్న 'బ్లాక్ మనీ' బరువు
అని స్ట్రైట్ అనాలిసిస్!

— డాక్టర్ గుమ్మమూరు రమేష్‌బాబు

రోడ్డుమీద వాహనాలు అతివేగంగా దూసుకుపోతున్నాయి

ప్రజలు అతన్నే గమనిస్తున్నారు

కానీ అతను ఎవరూ వూహించనంత త్వరగా, రెప్పపాటు కాలంలో పరుగెత్తుకుంటూ వెళ్ళి నడిరోడ్డుమీద నిలబడ్డాడు

ఈసారి అతనికి చావు తప్పదు అనుకున్నారు అంతా

కానీ —

ఎదురుగా వస్తున్న ఓ లారీని ఆపమన్నట్టు సంకేతం చేస్తూ నడిరోడ్డుమీద అలాగే నిలబడ్డాడు

లారీ అతివేగంగా వస్తోంది ఇతను తొలిగిపోతాడులే అన్న నమ్మకంతో లారీ వ్యాక్యూమ్ హారన్ మోగించుకుంటూ దూసుకువస్తోంది

ఇప్పుడు అతనికి లారీకి కొద్దిపాటి దూరంవుంది

అతను ఇప్పటికైనా ఇవతలికి వచ్చే అవకాశం వుంది

కానీ అతను అలాగే నిలబడి, రోడ్డుమీద ఎదురుగా దూసుకువస్తున్న లారీని ఆపమన్నట్టు సంకేతం చేస్తూనేవున్నాడు

కీచుమని శబ్దం చేసుకుంటూ లారీ ఆగిపోయింది

ఆ పిచ్చివాడు వెంటనే తన ఒంటిమీద వున్న చొక్కా వూడదీసి, లారీ ముందుభాగం తుడవసాగాడు

అక్కడి ప్రజలకు ఇది అనూహ్యమైన విషయం

అతని చర్య అందరికీ నవ్వు తెప్పించింది

చివరికి లారీ కేబిన్‌లో కూర్చున్నవారికి కూడా

కానీ నాకు నవ్వు రాలేదు

ఆశ్చర్యంతో జరుగుతున్న దృశ్యం గమనిస్తున్నాను

అతను ఇప్పుడు నంబరు ప్లేటు వేళ్ళాడే, లారీ బంపరు మీదకి ఎక్కి నుంచుని, తన మురికి చొక్కాతో డ్రైవరు ముందున్న అద్దం తుడవసాగాడు

ఆ లారీ అలా ఆగిపోవటంవల్ల అటూ ఇటూ వాహనాలకూ అవరోధం అయిపోయి, ట్రాఫిక్ జామ్‌కాసాగింది

ఆ పిచ్చివాడి పట్ల జాలి కలిగిందో —

లేక —

ఇతన్ని వదిలించుకునేందుకు మరో మార్గం లేదనో ఏమో —

ఆ లారీ కేబిన్‌లో కూర్చున్న ఓ పెద్దమనిషి తన జేబులోంచి రెండు రూపాయల నోటు తీసి, చెయ్యి బయటకు చాపి, ఆ పిచ్చివాడికి అందించాడు

ఆ నోటు అందుకుని, పిచ్చివాడు లారీ దిగిపోయాడు

క్షణంలో ట్రాఫిక్ క్లియర్ అయిపోయింది

ఆ పిచ్చివాడు తిరిగి చెట్టుకిందికి చేరాడు

అతను తన మురికి పాంటు జేబులోకి చెయ్యి పోనిచ్చి, క్షణం తరువాత బయటకు తీసాడు

ఇప్పుడు అతని చేతిలో రూపాయి నోట్ల మడత వుంది

ఆ కట్టలోకి ఈ రెండు రూపాయల నోటు జతపరిచి మొత్తం డబ్బు తిరిగి జేబులో భద్రపరిచాడు

అతని జేబులో అంత డబ్బువుంటుందని ఎవరూ వూహించలేదు కాగా అతను క్షణంలో రెండు రూపాయలు సంపాదించిన తీరు అందరికీ ఆశ్చర్యంతోపాటు అసూయ కూడా కలిగించింది

రోజు అంతా రెక్కలు ముక్కలు చేసుకున్నా రెండు రూపాయలు మిగలని రోజులు ఇవి అలాంటిది ఆ పిచ్చివాడు నిముష మాత్రంలో ఎలాంటి పెట్టుబడి, ఎలాంటి శ్రమలేకుండా డబ్బు సంపాదించటం అక్కడి ప్రజలకు సహించరాని విషయం అయిపోయింది

సూటు బూటు వేసుకుని నాగరికహోదా ప్రదర్శిస్తున్న అందరికీ అతను అసూయ కలిగించసాగాడు

అంతే !

ఆ అసూయలో తలా ఒకమాట అన్నారు

''ఇలాంటి పిచ్చివాళ్ళు పెద్ద న్యూసెన్సు''

''చూడండి ! ట్రాఫిక్ ఎలా జామ్ అయిందో''

''ఇతను లారీకింద పడి చనిపోతే నో ప్రాబ్లెం కానీ ఇతన్ని సేవ్ చేయాలన్న ప్రయత్నంలో వేగంగా వచ్చే లారీలు కంట్రోలు తప్పి ఈ చెట్టుకి గుద్దుకుంటే ముందు మనం ఛస్తాం''

''ఇలాంటి వారివల్ల దమ్మిడీ ప్రయోజనంలేదు సరిగదా, సమాజానికి పెద్ద నష్టం''

''అతన్ని తీసుకువెళ్ళి పిచ్చి ఆసుపత్రిలో చేర్పించాలి''

''కాదు కాదు ముందు పోలీసులకి అప్పగించాలి వాళ్ళు ముందు దేహశుద్ధి చేస్తారు''

''ఆ పనికి పోలీసులుదాకా ఎందుకు ?''

''మనమే నాలుగు అంటించితే దారికివస్తాడు''

''పట్టుకోండి తన్నండి''

''మారో—''

ఇంతలో —

సిటీబస్సు వచ్చింది

పిచ్చివాడి విషయం మరిచిపోయి అంతా బస్సుమీద ఎగబడ్డారు

నిముషంలో బస్సు వెళ్ళిపోయింది

నాకెందుకో బస్సు ఎక్కాలనిపించలేదు

ఇప్పుడు చెట్టుకింద నేను, ఆ పిచ్చివాడు!

''చూడు బాబూ ! నీవాళ్ళు ఎవరూ లేరా నీకు ఈ పిచ్చి ఎలా వచ్చింది'' అన్నాను నేను

''అంతా వున్నారు కానీ మీరనుకున్నట్టు నాకు పిచ్చిలేదు''

నేను ఆశ్చర్యపోలేదు కారణం పిచ్చివాళ్ళు తమకి పిచ్చి వుందని ఎప్పుడూ వప్పుకోరు

''పిచ్చి లేదంటావు మరి రోడ్డుమీద అలా పరుగెత్తటం పిచ్చివాడి చర్య కాదూ''

''అలా మీకనిపించవచ్చు''

''మరి నీకేమనిపిస్తుంది''

''నాకేమనిపించినా, చూసేవారికి నేను పిచ్చివాడుగా అగుపించటమే నాకు కావలసింది''

''ఎందుకు ?''

''పొట్టకూటి కోసం'' అన్నాడు అతను సూటిగా నా కళ్ళల్లోకి చూస్తూ

''అయితే అలా రోడ్డుకి అడ్డంగా నిలబడటం రిస్కు కదూ''

''తప్పదు యం ఏ పాస్ అయ్యాను ఉద్యోగం లేదు నామీద నాలుగు ప్రాణాలు ఆధారపడి వున్నాయి ముసలి తల్లిదండ్రులు ఇంకా పెద్దరికం ఏర్పడని చిన్న తమ్ముళ్ళు ఏదో రకంగా ఇంత సంపాదించి వాళ్ళకి తిండి పెట్టాలి —''

అతను తను చెప్పేది పూర్తి చేయకుండానే గబగబా పరుగెత్తుకెళ్ళి రోడ్డుమీద నిలబడ్డాడు

ఎదురుగా ఓ లారీ దూసుకువస్తోంది

అతను లారీని ఆపమన్నట్టుగా సంకేతం చేస్తున్నాడు

లారీ కీచుమని శబ్దం చేస్తూ ఆగింది

కానీ అతని ముందు కాదు

అతన్ని దాటి పదిగజాల అవతల —

అతను రక్తం మడుగులో వున్నాడు

''నా మీద నాలుగు ప్రాణాలు ఆధారపడి వున్నాయి'' అన్న అతని మాటలు నా చెవిలో గింగురుమంటున్నాయి ●

## పాలన

అంతా సవ్యంగా సాగితే—
స్వాతంత్ర్యం మంచిదే!
పాలకులకు ఆవేశం రానీక
ఏమి చేస్తున్నారని అడగక!
వేళ్ళు లెక్కేస్తూపోతే
ఎన్ని ఏళ్ళయినా లెక్కించవచ్చు
ప్రయోజన శూన్యంగా!!

—ఉత్పల వరదరాజా

